జన సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం


ద్వాక్రా సంఘాల మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు


హాజరైన ద్వాక్రా సంఘాల మహిళలు

- ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు
- కోడూరులో వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు అందజేత

రైల్వేకోడూరు : జన సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అని.. పొదుపు సంఘాల అక్కా చెల్లెమ్మలకు బాసటగా వైఎస్సార్ ఆసరా ప్రవేశపెట్టారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంపైన వైఎస్సార్ ఆసరా మూడవ విడత పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కోడూరు మండల పరిధిలో మొత్తం 1130 గ్రూపులకు గాను 10,56,05,175 రూపాయల మెగా చెక్కును కొరముట్ల శ్రీనివాసులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల్లోని మహిళలకు బ్యాంకుల్లో ఉన్న అప్పును తాము అధికారంలోకి వస్తే తీరుస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆనాడు హామీ ఇచ్చారని, అందులో భాగంగానే అధికారంలోకి రాగానే వైఎస్సార్ ఆసరా పథకాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. నాడు చంద్రబాబు మాట నమ్మి డ్వాక్రా అక్కా చెల్లెమ్మలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం చేసిన మోసానికి పొదుపు సంఘాలన్నీ ఆర్థికంగా దెబ్బతిన్నాయన్నారు. ఏ గ్రేడ్‌లో ఉన్న సంఘాలన్నీ సి, డీ గ్రేడ్‌కు పడిపోయాయని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితిలో జగన్ గ్రూపు సంఘాలను ఆదుకుంటానని, ఉన్న అప్పులను నాలుగు విడతల్లో ఇస్తానని మాట ఇచ్చారన్నారు. ఆ మాట నిలుపుకుంటూ ఈ రోజు వైఎస్సార్ ఆసరా కింద నగదు పంపిణీ చేయడం జరిగిందన్నారు. దేశ చరిత్రలో తొలిసారిగా నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ కాంట్రాక్టుల్లో 50 శాతం మహిళలకు దక్కేలా ఏకంగా సీఎం జగన్ చట్టం తీసుకుని వచ్చారన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో వైఎస్సార్ ఆసరా కింద రూ. 89 కోట్లు మంజూరు అయినట్లు తెలియజేశారు. అనంతరం వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును మహిళా సంఘాలకు అందజేశారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్‌చేసి పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.

- కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఎంపీపీ భవాని, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెట్పీటీసీ రత్నమ్మ, మార్కెట్‌కమిటి చైర్మన్ సుబ్బరామరాజు, పట్టణ అధ్యక్షుడు సిహెచ్.రమేష్, గునిశెట్టి రమేష్, ఏరియా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, శ్రీరామ్ వినోద్, బండారు మల్లిఖార్జున, జనార్దన్‌రాజు, సుబ్రమణ్యం, రాజారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గాయపడిన సర్పంచ్‌కు పరామర్శ

పుల్లంపేట: పుల్లంపేట మండలం పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డిని, బోగా పార్థసారథిలను శనివారం రైల్వేకోడూరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి పరామర్శించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలలో కేవలం ఒకసీటు గెలిచి సంబరపడుతున్న టీడీపీ నాయకులకు 2024 ఎన్నికలలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. టీడీపీ నాయకులు బాణసంచా పేల్చి వైఎస్సార్ సీపీ నాయకులపై దౌర్జన్యాలు చేసి... తిరిగి వైఎస్సార్ సీపీ నాయకులే దాడి చేశారనడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యకర్తలు అధైర్యపడరాదని .. అండగా తాము ఉంటామని ధైర్యం చెప్పారు. సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఉద్దేశ్యపూర్వకంగా తనపై టీడీపీకి చెందిన కార్యకర్తలు కె జగదీశ్వర్ రెడ్డి, దేవరకొండ నవీన్ కుమార్, కేసినేని వెంకటేష్ నాయుడులు దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముస్తాక్, మల్లికార్జున రెడ్డి, శంకర్ రెడ్డి, బీకే మణి, మడగలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.


సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డిని, పార్థసారధిని పరామర్శిస్తున్న కొరముట్ల , కొల్లం గంగిరెడ్డి

ఎన్‌ఎంఎంఎస్‌కు 15 మంది విద్యార్థుల ఎంపిక

రాయచోటి టౌన్ : రాయచోటి మోడల్‌స్కూల్‌కు చెందిన 15 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎన్. రజనీకృష్ణ శనివారం తెలిపారు. గత ఏడాదిలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 80 మంది హాజరు కాగా 15 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వీరికి జాతీయ స్థాయి నుంచి మెరిట్ స్కాలర్‌షిప్ ఇంటర్ మీడియట్ వరకు ప్రతి సంవత్సరం 12,000 ప్రకారం పొందుతారని చెప్పారు. ఎన్ఎంఎంఎస్‌కి తమ పాఠశాల నుంచి ఇంత మంది అర్హత సాధించడంపై ఆమె విద్యార్థులను అభినందించారు.


రాయచోటిలో ఎన్ఎంఎంఎస్‌కు అర్హత సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాజంపేట టౌన్:
స్థానిక మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఈ.గీతిక, కే.విక్రమ్‌రావు అనే విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్ఎంఎంఎస్) స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం కొండూరు పరిమళ తెలిపారు. ఈసందర్భంగా శనివారం స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ఆమె అభినందించి మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.


రాజంపేటలో..


పెనగలూరులో..

పెనగలూరు: మండలంలోని మోడల్ స్కూల్ నుంచి ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఐదు మంది విద్యార్థులు ఎంపికై నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సహజబ్లెస్సీ తెలిపారు. శనివారం ఐదు మంది విద్యార్థులను ప్రార్థనా సమయంలో ప్రత్యేకంగా పిలిపించి వారికి మెమెంటోలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎం పురుషోత్తం, సి సుధీర్, ఎం మోక్షప్రియ, ఎం గోపీచందన, కె మోక్షితలు స్కాలర్ షిప్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి తిరుణాల


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

రాయచోటి టౌన్ : రాయచోటి - రాజంపేట క్రాస్ రోడ్డులోని శ్రీ అభయాంజనేయస్వామి తిరుణాల శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఆకు పూజలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ఆలయ పాలక మండలి అధ్యక్షులు మేకల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా చాందినీ బండ్లతో తిరుణాల నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు రాయచోటి చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలి వచ్చారు.

లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో..

సంబేపల్లె : మండలంలోని అడవికమ్మపల్లెలో వెలసిన శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గావించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.



మేడాలమ్మతల్లికి పూజలు



పుల్లంపేట: మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలో వెలసివున్న మేడాలమ్మ తల్లికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడాలమ్మతల్లి నూతన ఆలయం నిర్మించి 40 రోజులు పూర్తి అయిన సందర్భంగా దాతలు పెద్దఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. వేకువజాము నుంచే మేడాలమ్మతల్లి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తీర్చుకున్నారు.

నమో.. నారసింహా..


చిన్నమండెంలో..

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె గ్రామంలో వెలిసియున్న శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్ మూర్తిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని రాయచోటి-వేంపల్లి రహదారి మార్గంలోని మర్రిచెట్టు క్రాస్ వద్ద వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అర్చకులు వెంకటనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో అభిషేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేక పూజలకు హాజరైన ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరి కాయలు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రాకపోకలను అడ్డుకోవడం చట్టరీత్యా నేరం

రాయచోటి టౌన్ : రోడ్డుకు అడ్డంగా రాళ్లు వేయడం, కంప వేయడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి మాధవరం ప్రజలను హెచ్చరించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం గ్రామంలోని మద్దెలవాండ్లపల్లె సమీపంలో జగనన్న లేఅవుట్లు వేశారు. అక్కడ గతంలో దారి ఉండేదని దానిని మూసి వేసి అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారంటూ రామయ్య, లక్ష్మమయ్యలు ఆ లేఅవుట్లకు దారి లేకుండా ప్రధాన దారికి అడ్డంగా రాళ్లు, ముళ్ల పొదలు వేసి ప్రజలు, వాహనాల రాకపోకలు జరగనీయకుండా ఆపేశారు. ఈ విషయాన్ని గ్రామ ప్రజలు పోలీసులకు తెలియచేయడంతో సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ నరసింహారెడ్డి, తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లారు. ఇలా దారి మూసివేయడం చట్టరీత్యా నేరమని, ఏదైనా సమస్య ఉంటే రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అక్కడే ఉన్న వీఆర్‌వోను పిలిచి లే అవుట్లలో స్థలాలు పొందిన వారికి పట్టాలు ఇచ్చారా లేదా అని విచారించి సమస్యను పరిష్కరించారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సుధాకర్‌రెడ్డి

క్లుప్తంగా

సకాలంలో బిల్లుల చెల్లింపు

– హౌసింగ్ డీఈ రమణారెడ్డి

సిద్దవటం: వివిధ దశల్లోపూర్తయిన పక్కా గృహాల లబ్ధిదారులకు సకాలంలో బిల్లులను చెల్లిస్తున్నామని హౌసింగ్ డీఈ సి. రమణారెడ్డి తెలిపారు. సిద్దవటంలోని హౌసింగ్ ఏఈ కార్యాలయంను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా సిద్దవటం మండలంలోని 10 గ్రామ సచివాలయాలకు 1151 పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. ఇందులో 303 గృహాలు పూర్తి అయ్యాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ చెన్నయ్య పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

చిన్నమండెం : మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో శనివారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 7 రోజుల ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. మానవ సేవయే మాధవసేవ అని, సమాజ శ్రేయస్సు కోసం విద్యార్థులను భాగస్వామ్యం చేయడమే ఎన్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యమని బాధ్యప్రిన్సిపల్ నరసింహులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 7 రోజులు దత్తత గ్రామం చిన్నర్సుపల్లెలో వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటామని ఎన్ఎస్ఎస్ పీఓ నాగనవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దామోదర్, పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

రాయచోటి టౌన్ : రాయచోటి ఎస్ఈబీ స్టేషన్‌లో పట్టుబడిన 11 వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నామని రాయచోటి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ధీరజ్ రెడ్డి తెలిపారు. గత కొన్ని నెలలుగా ఎక్సైజ్ నేరాలలో పట్టుబడిన ఈ వాహనాలు వేలానికి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు సోమవారం ఉదయం 10-30 గంటలకు రాయచోటి ఎస్ఈబీ స్టేషన్‌లో నిర్వహించే వేలం పాటలో పాల్గొన వచ్చని పేర్కొన్నారు.

రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా గంగా ప్రసాద్



రాయచోటి: రాయచోటి గ్రేడ్ వన్ మున్సిపల్ కమిషనర్‌గా గంగా ప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. శనివారం రాష్ట్ర మున్సిపల్ పరిపాలన పురపాలకశాఖ నుంచి రాయచోటి కార్యాలయానికి ఆదేశాలందాయి. నెల్లూరు జిల్లా, వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై రాయచోటికి రానున్నారు. స్థానికంగా పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాంబాబును విజయవాడ కార్యాలయానికి బదిలీ చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గాలివీడు: నూలివీడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. మద్దిరాళ్ల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఎంపీయూపీ ఉర్దూపాఠశాలలో మదనపల్లె ఆధ్య హాస్పిటల్, రమా నేత్రాలయ వైద్యులు డాక్టర్ సవత్ రెడ్డి, డాక్టర్ పావనీ రెడ్డి, డాక్టర్ ఎం మహేష్ రెడ్డి వైద్య సేవలు అందించనున్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని మద్దిరాళ్ల కుటుంబ సభ్యులు తెలిపారు.

డీఈఓకు సన్మానం

పెనగలూరు: జిల్లాకు వచ్చిన నూతన విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తంను శనివారం పెనగలూరు మండల ఎస్టీయూ రాష్ట్ర నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర నాయకులైన పిల్లి రామకృష్ణ, పుచ్చకాయల ఎల్లయ్య, పశుపులేటి నరసింహులుతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఆయనకు స్వాగతం పలికారు. అలాగే శాలువతో సత్కరించి ఉపాధ్యాయుల సమస్యలను డీఈఓకు వివరించినట్లు వారు తెలిపారు. నూతన డీఈఓ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

గడువు పొడిగింపు

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ పరిధిలోని ఏపీ సాంఘీక సంక్షేమ గురకుల పాఠశాలలో 5, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం (బాలుర) విద్యార్థులకు ఈనెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలలో ఇంగ్లీషు మీడియంలో విద్యాబోధన ఉంటుందని, ఇంటర్ మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు ఉన్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

రేపు వేలం పాట

లక్కిరెడ్డిపల్లి: లక్కిరెడ్డిపల్లి పంచాయతీలోని బస్టాండ్ గేటు షాపింగ్ కాంప్లెక్స్ నాలుగు రూములకు ఈనెల 27వ తేదీన పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, ఉపసర్పంచ్ రాజారెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాటదారులు గ్రామ పంచాయతీకి ఎలాంటి బాకీ ఉండకూడదని, పాటలో పాల్గొనేవారు ముందుగా లక్షరూపాయలు ధరావత్ చేయాలని, అలాగే బస్టాండ్‌గేటుకు కాంప్లెక్స్ రూములకు రూ. 20 వేలు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు. ఈ పాట ఒక సంవత్సరంపాటు పాటదారుల చేతిలో ఉంటుందని వారు తెలిపారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

పెనగలూరు: సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరంలాంటిదని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలియజేశారు. మండలంలోని కోమంత రాజుపురం పంచాయతీ, బెస్తపల్లికి చెందిన బత్తల శ్రీనివాసులకు రూ. 3,27,000లు సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా బత్తల శ్రీనివాసులు హైదరాబాద్ గ్లోబల్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి ద్వారా పై మొత్తాన్ని మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కోడూరు సీనియర్ నాయకుడు ధ్వజారెడ్డి, కొల్లం గంగిరెడ్డి, సుధాకర్ రాజు, పెనగలూరు వైఎస్సార్‌సీపీ యూత్ ప్రెసిడెంటు దిలీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాగి స్కూటర్ నడిపినందుకు మూడు రోజులు జైలు

రాయచోటి టౌన్ : మద్యం తాగి స్కూటర్ నడిపినందుకు పళ్ల శ్రీధర్ అనే వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ ఏజెఎఫ్‌సీఎం(రాయచోటి కోర్టు) న్యాయమూర్తి శారద తీర్పు చెప్పారు. ఈ నెల 3వ తేదీ రాయచోటి రూరల్ పరిధిలోని నక్కవాండ్లపల్లె సర్కిల్ వద్ద ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో శ్రీధర్ మద్యం తాగి స్కూటర్ నడుపుతుండగా పోలీసులకు పట్టుబడ్డారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పెట్టగా శనివారం న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు.

ఫొటోగ్రఫీతో చక్కటి ఉపాధి

ఏఎఫ్‌యూ: ఫొటోగ్రఫీని కెరీర్‌గా ఎంచుకునేవారికి చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన కెనాన్ ప్రొడీవీ సంస్థ ఫొటోగ్రఫీ శిక్షకుడు పి. అహ్మద్ తెలిపారు. కడప నగరంలోని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో కెనాన్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒక్కరోజు ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్, ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులు ఫొటోగ్రఫీ వైపు రావడం శుభపరిణామమన్నారు.

అత్తపై అల్లుడి హత్యాయత్నం

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పటేల్‌రోడ్డులో నివాసం వుంటున్న గాలి రమాదేవి (50) అనే మహిళను శనివారం ఆమె అల్లుడు దాదిరెడ్డి శ్రీనివాసులరెడ్డి కత్తితో దారుణంగా పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తన భార్య శిరీషను, తన అత్త రమాదేవి కాపురానికి పంపడం లేదని కక్షసాధింపు చర్యగా ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. రమాదేవి ఇంటిలో ఒంటరిగా వున్న సమయంలో నేరుగా కత్తితో వెళ్లిన శ్రీనివాసులరెడ్డి ఆమె శరీరంపై విచక్షణా రహితంగా నరికాడు. ఆ సమయంలో రమాదేవి కుమార్తె శిరీష తన కుమార్తె చదువుతున్న పాఠశాలకు క్యారియర్ ఇచ్చేందుకు వెళ్లింది. శిరీష ఇంటికి రాగానే తన తల్లి రమాదేవి తీవ్రగాయాలతో పడివుంది. వెంటనే ఆమెను స్థానికులు, బంధువులు గుర్తించి వెంటనే కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నచౌక్ ఎస్ఐ ఎస్‌కే రోషన్ తెలియజే శారు. కాగా ఈ కేసులో నిందితుడు శ్రీనివాసులరెడ్డి డిఆర్‌డిఓలో సైంటిస్ట్‌గా పని చేస్తున్నాడు.

ఇటుకల ట్రాక్టర్ బోల్తా

రాజుపాళెం: మండలంలోని కొర్రపాడు-గోపవరం గ్రామాల మధ్యలో ఆవు సమాధికి సమీపంలో శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు ఇటుకల ట్రాక్టర్ పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రొద్దుటూరు నుంచి రాజుపాళెంకు వెళుతున్న ఇటుకల ట్రాక్టర్, ప్రొద్దుటూరు నుంచి కృష్ణంపల్లెకు వెళుతున్న ఆర్టీసీ బస్సు క్రాస్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి పొలాల్లోకి దూసుకెళ్లి మోరీని ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజుపాళెంకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ శ్రీనివాసులుకు గాయాలయ్యాయి.

రూ.30 వేలు సహాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్: పట్టణంలోని బోయపాళెంకు చెందిన వెంకటసుబ్బయ్య చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అందువల్ల ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు శనివారం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన కుటుంబ సభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో లక్ష్మీప్రసాద్, నరసింహులు, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

విద్య వెలకట్టలేనిది

రాజంపేట టౌన్: విద్య వెలకట్టలేని సంపద అని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక సరస్వతీ విద్యామందిరం పాఠశాలలో శనివారం జరిగిన ఆ పాఠశాల వార్షికోత్సవ వేడుకకు ఆకేపాటి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణ అలవడితే విద్యపై కూడా శ్రద్ధ చూపగలరన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం గౌరీ, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు డాక్టర్ సీ.సుధాకర్, కాకర్ల రాముడు, పబ్బిశెట్టి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత ఆశయంతో చదవాలి

సిద్దవటం: విద్యార్థులు ఉన్నత ఆశయంతో చదివినప్పుడే మేధావులు అవుతారని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. సిద్దవటం మండలంలోని మాధవరం-1 గ్రామంలోని హ్యాపీ కిడ్స్ హైస్కూల్ 16వ వార్షికోత్సవం శనివారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడి పాఠశాలను 15 సంవత్సరాల కిందట తానే ప్రారంభించానన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్‌బోర్డు డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంఈఓ శంకరయ్య, కరస్పాండెంటు అనిల్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఓ రద్దు చేసేవరకూ పోరాటం

రాయచోటి అర్బన్ : బోయ, బంతు, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు ఉద్దేశించిన జీఓ నం.52ను రద్దుచేసేవరకు పోరాటం చేస్తూనే ఉంటామని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథనాయక్, లంబాడీ సంఘం నేత శంకర్‌నాయక్, ఆల్‌ఇండియా బంజారా సంఘం జిల్లానేత నారాయణ నాయక్‌లు అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో గిరిజన సంఘం నేతలు మణుగూరు నాయక్, రమేష్, మనోహర్, బాయప్పనాయక్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

చిట్వేలి: మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ చిట్వేలిశాఖ ఆధ్వర్యంలో మండలంలోని 373 మంది పదోతరగతి విద్యార్థులకు దాతల సహకారంతో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు పేమ్మసాని పురుషోత్తం, ఉపాధ్యాయులు తిరుమల విశ్వనాథంలు మాట్లాడుతూ పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ. 5 వేలు అందజేస్తామని ప్రకటించారు. అలాగే 550 మార్కులు సాధించిన విద్యార్థులకు తన కళాశాలలో ఉచితంగా సీటు ఇస్తామని సాయి జూనియర్ కళాశాల అధినేత శ్రీనివాసులు రెడ్డి ప్రకటించారు. అనంతరం దాతలు, చిట్వేలి ఉపసర్పంచ్ చొడవరం ఉమామహేశ్వర్ రెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్షులు మునిరావు, కార్యదర్శి సాయిరాం, సలహామండలి సభ్యులు రంగారెడ్డి, నరసరామయ్య, ఉపాధ్యాయులు ఏబీఎస్ ప్రసాద్, డేవిడ్ ప్రసాద్, రాజశేఖర్, మానవతా సభ్యులు మణి తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులపై అవగాహన



మాట్లాడుతున్న హెచ్ఎం రెడ్డన్న

గాలివీడు: వాతావరణంలో జరిగే మార్పులు, ఎనర్జీ (శక్తి) పరిరక్షణ గురించి అందరిలోనూ అవగాహన కల్పించేందుకే ఎర్త్ హవర్ డేను జరుపుకుంటున్నామని ప్రధానోపాధ్యాయులు రెడ్డన్న పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఎర్త్ హవర్, గ్లోబల్ వార్మింగ్‌కు గల సంబంధాన్ని విద్యార్థులకు తెలియజేశారు.

ఏఐటీఎస్‌లో సివిల్ స్టూడెంట్ చాప్టర్ ప్రారంభం

రాజంపేట: ఏఐటీఎస్‌లో ఐఈఐ (ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్) చాప్టర్ సివిల్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ కార్యక్రమంను శనివారం ప్రారంభించారు. కడప ఐఈఐ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, సెక్రటరీ నరేంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు భవిష్యత్తులో చార్టెడ్ ఇంజనీర్లుగా ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, కో-ఆర్డినేటర్ పీవీ సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- ఉన్నత ఆశయాలతో విద్యాభ్యాస్యం కొనసాగించాలని ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి అన్నారు. శనివారం విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్ : అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. శనివారం పూల్ క్యాంపస్ డ్రైవ్ ప్రచార కరపత్రాలను విడుదల చేశారు.